21.07.2020



4-51

## మున్నుడి

శ్రీహరిచేతి సుదర్శన చక్రాన్ని కీర్తిస్తున్నారు అన్నమయ్య. బాల్యంలో అట్టముక్కను 'విష్ణుచక్రం' లా కత్తిరించి చూపుడు వేలికి పెట్టుకొని ఆడుకోవటం నాకింకా గుర్తు. ఒకనాడు అన్నమయ్య వర్ణనకి వివరణ వ్రాస్తానని నేను కలగని కూడ వుండను. శ్రీహరి చక్రానికి ఇన్ని 'కోణాలు' ఉంటాయని ఎంతమందికి తెలుస్తుంది చెప్పండి... పండితులకి, పౌరాణికులకు మాత్రమే తెలిసిన ఈ సుదర్శన చక్ర వర్ణన ఈ కీర్తనద్వారా మనం తెలుసుకొన్నామంటే అది మన పూర్వజన్మ సుకృతమే కదా!

ఆ.వె॥ అసుర ఘాతమైన హరిచేతి చక్రమా!
సమర విజయమైన చక్రిపనుప
ఇట్టి వర్ణనంబు నెరుగము యెన్నడు
అన్నమయ్య పొగిడె నద్భుతముగ.

రాగం : సాళంగనాట

నమో నమో దానవ వినాశ చక్రమా
సమర విజయమైన సర్వేశు చక్రమా ॥నమో॥

అట్టె పదారు భుజాల నమరిన చక్రమా
పట్టిన ఆయుధముల బలు చక్రమా
నెట్టన మూడుగన్నుల నిలిచిన చక్రమా
ఱట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా ॥నమో॥

ఆరయ నారు గోణాల నమరిన చక్రమా
ధారలు వేయిటి తోడి తగు చక్రమా
ఆరక మీదికి వెళ్ళే అగ్ని శిఖల చక్రమా
గారవాన నీ దాసుల గావవే చక్రమా ॥నమో॥

రవిచంద్ర కోటితేజ రాసియైన చక్రమా
దివిజ సేవితమైన దివ్యచక్రమా
తవిలి శ్రీవేంకటేశు దక్షిణ కర చక్రమా
యివల నీ దాసులము యేలుకోవే చక్రమా ॥నమో॥

భావామృతం :

ఓ సుదర్శన చక్రమా! దానవుల వినాశనమునకు రూపుదాల్చిన చక్రమా! సర్వేశ్వరుడైన శ్రీవేంకటేశ్వరునికి అనేక యుద్ధములలో విజయమును చేకూర్చిన చక్రమా! నమో నమః (నీకు వందనములు)

ఓ సుదర్శన చక్రమా! నీకు 'పదారు భుజాలు అమరినవి' (పదియారు వైపులున్నవి). శ్రీహరి పట్టిన ఆయుధములలోకెల్ల నీవే బలమైన దానివి. నెట్టన (అనివార్యమైన) త్రినేత్రమువంటి చక్రమా! అట్టుగా మన్నించవే మెఱయు చక్రమా! (అట్టు అంటే 'నింద' అని అర్థం. కాని ఇక్కడ బాహాటంగా ఆర్తులను మన్నించుమా సుదర్శనమా! అనే అర్థంలో అన్నమయ్య వాడారు) అని నా భావన.

పరిశీలించగా ఈ సుదర్శనానికి ఆరు కోణములున్నవి. దానికి వేయి పదునైన ధారలు (కోయుశక్తిగల అంచలు, కటింగ్ ఎడ్జెస్) వున్నవి. ఆర్పినా ఆరని అగ్ని కీలలు, విస్ఫులింగాలను వెదజల్లుతుంటే, అది మీది మీదికి వస్తుంటుంది. అట్టి సుదర్శన చక్రమా గారవాన (ప్రేమతో) నీ దాసులను రక్షింపుము.

ఓ సుదర్శన చక్రమా! నీవు కోటి సూర్యచంద్రుల దివ్య తేజస్సుకలదానవు. దేవతలచే సేవించబడు దివ్యమైనదానవు. తిరుమల శ్రీవేంకటేశ్వరుని కుడిచేతిలో వెలుగొందు సుదర్శన చక్రమా! నీవు నీదాసులమైన మమ్ము పరిపాలించుకొనుము.